క్లుప్తంగా

నరమనేని వెంకటేష్‌కు సత్కారం



వత్సవాయి: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడిగా నియమితులైన వత్సవాయి మండలం వేమవరం గ్రామానికి చెందిన నరమనేని వెంకటేష్‌ను ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు గురువారం ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా తన్నీరు మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ పటిష్టతకు కృషిచేయాలని వెంకటేష్‌కు సూచించారు. రాజకీయాల్లో యువతను ప్రోత్సహించిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో యువతకు అనేక పదవులు ఇచ్చారని గుర్తుచేశారు. నియోజకవర్గంలో పార్టీ పటిష్టతకు యువత మరింత కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి కన్నమాల శామ్యూల్, కనకదుర్గమ్మ ఆలయ మాజీ డైరక్టర్ నంబూరి రవి, మాజీ ఏఎంసీ డైరక్టర్ పింగళి నరసింహారెడ్డి, మన్నె అప్పారావు, పట్టణ ప్రచార విభాగం అధ్యక్షుడు గోగుల వినోద్‌కుమార్, శీలం మంగారావు, దార్ల ప్రసన్న పాల్గొన్నారు.

ఆలయానికి రూ.30 వేలు విరాళం



పెనుగంచిప్రోలు: వత్సవాయి మండలం కంభంపాడు గ్రామానికి చెందిన ఉయ్యూరు అప్పారావు, సరిత దంపతులు శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి రూ.15 వేలు, గోశాలలో గోవుల సంరక్షణకు రూ.15 వేలు విరాళంగా అందజేశారు. ఈ మేరకు నగదును గురువారం ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేసవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

బ్రాహ్మణ సమాఖ్య కార్యదర్శిగా భరద్వాజ్



వత్సవాయి : ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శిగా కొమరగిరి రవీంద్ర భరద్వాజ్ ఎన్నికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు కోనూరు సతీష్ నుంచి గురువారం ఆయన నియామక ఉత్తర్వులను అందుకున్నారు. జగ్గయ్యపేట మండలం తిరుమలగిరి శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్‌గా ఉన్న భరద్వాజ్‌ను రాష్ట్ర బ్రాహ్మణ సంఘ కార్యదర్శిగా నియమితులు కావడంపై సంఘ సభ్యులు, నియోజకవర్గానికి చెందిన బ్రాహ్మణులు ఆయనకు అభినందనలు తెలియజేశారు. ఈసందర్భంగా భరద్వాజ్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు కోనూరు సతీష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

నేడు దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): మండలంలో 2024–25కు సంబంధించి ఆయా కార్పొరేషన్ల రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నితిన్ గురువారం తెలిపారు. బ్యాంకు అధికారులతో కలిసి ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అన్నవరం, అనుమంచిపల్లి, బలుసుపాడు, బండిపాలెం, బూదవాడ, ధర్మవరప్పాడుతండ, చిల్లకల్లు, తిరుమలగిరి, తొర్రకుంటపాలెం, గండ్రాయి, మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదుగంటల వరకు గౌరవరం, జయంతిపురం, కెఅగ్రహారం, ముక్త్యాల, మల్కాపురం, పోచంపల్లి, రామచంద్రునిపేట, షేర్‌మహ్మద్‌పేట, తక్కెళ్లపాడు, వేదాద్రి గ్రామాల దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని వివరించారు. దరఖాస్తుదారులు సంబంధిత సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ ఏఎస్‌ఐ దుర్మరణం

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని విష్ణుప్రియనగర్‌కు చెందిన రిటైర్డ్ ఏఎస్‌ఐ కృష్ణ రంగారావు(72) బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే..స్థానిక చిల్లకల్లు రోడ్‌లో ఎస్‌జీఎస్ కళాశాల వద్ద రోడ్డు దాటుతుండగా ఎదురుగా వస్తున్న బైకు ఢీకొనడంతో కృష్ణ రంగారావు రెండు కాళ్లు విరిగిపోవడంతోపాటు తీవ్రంగా గాయపడ్డాడు.దీంతో చికిత్స నిమిత్తం ఆయనను విజయవాడకు తీసుకువెళ్తుండగా మార్గంమధ్యలో మృతిచెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు, పార్టీ నాయకులు గురువారం ప్రభుత్వాస్పత్రికి వెళ్లి కృష్ణరంగారావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

మిర్చి రైతు కంట కన్నీరు

- ఏమాత్రం ఆశాజనకంగా లేని మిర్చి ధర..
- గతేడాది క్వింటా రూ.20వేల పైమాటే
- కూటమి పాలనలో రూ.12వేలకు మించని ధర
- కోల్డ్‌స్టోరేజీలకు తరలుతున్న మిర్చి
- 'తిరుమలసాయి' ప్రమాద ఘటనతో రైతుల్లో మరింత ఆందోళన



నవాబుపేట వద్ద కోల్డ్‌స్టోరేజీలో మిర్చిని నిల్వ చేసేందుకు తీసుకువచ్చిన రైతులు



కల్లాల్లోని మిర్చి రాశులు

పెనుగంచిప్రోలు: మిర్చి రైతుల ఆశలు అడియాసలుగానే మారాయి..గతేడాది వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో క్వింటా మిర్చి రూ.23వేల వరకు పలకడంతో ఈఏడాది కూడా ధరలు ఆస్థాయిలో ఉంటాయని భావించిన రైతులకు సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం తీవ్ర నిరాశే మిగిల్చింది. వేలాది రూపాయలు ఖర్చుచేసి మిర్చి సాగు చేస్తే, తీరా దిగుబడులు వచ్చే సమయానికి ధర సగానికి సగం పడిపోవడంతో మిర్చి రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ప్రస్తుతం ఉన్న ధరకు అమ్ముకోలేక.. భవిష్యత్‌లో ధర పెరుగుతుందనే ఆశతో రైతులు మిర్చిని కోల్డ్‌స్టోరేజీకి తరలిస్తున్నారు.

నెలరోజుల్లో రూ.2వేలు తగ్గిన ధర..

ఈ ఏడాది డిసెంబర్ వరకు మిర్చిని నిల్వ చేసేందుకు కోల్డ్‌స్టోరేజీలో యజమానులు టిక్కీకి రూ.170 నుంచి రూ.200 వసూలు చేస్తున్నారు. జిల్లాలో రైతులు 40 వేల ఎకరాల్లో మిర్చిసాగు చేశారు. గతేడాది కల్లాల్లోనే క్వింటా మిర్చి ధర రూ.20 వేల నుంచి రూ.23వేలు పలుకగా, ప్రస్తుతం క్వింటా మిర్చి రూ.8వేల నుంచి రూ.12 వేలు లోపు మాత్రమే పలుకుతోంది. నెల రోజుల వ్యవధిలో క్వింటాకు రూ.2వేల వరకు తగ్గింది. ధర మరింత పతనమవుతుండటంతో మిర్చి రైతులు కంట కన్నీరు వస్తోంది. ధరాఘాతంతో మిర్చి రైతులు విలవిలలాడుతున్నారు. అప్పుల బాధలు వేధిస్తున్నా, భవిష్యత్తులో ధర పెరుగుతుందనే ఆశతో మిర్చిని కోల్డ్‌స్టోరేజీల్లో నిల్వ చేసేందుకు తరలిస్తున్నారు.

కూలి ఖర్చులు కూడా రాని స్థితి..

మిర్చి ధర గతేడాదితో పోలిస్తే ఈఏడాది బాగా తగ్గడమే కాకుండా కొద్ది రోజులుగా మరింత పతనం కావటంతో రైతులను మరింత ఆందోళనకు గురిచేస్తోంది. జగ్గయ్యపేట ప్రాంతంలో అధికంగా సాగయ్యే తేజారకం మిర్చికి మార్కెట్‌లో మంచి ధర ఉండేది. కాని ఈ ఏడాది ఆపరిస్థితి లేకుండా పోయింది. క్వింటా మిర్చి కోయటానికి కూలీలకు రూ.5 వేలు వరకు ఖర్చవుతోందని, ప్రస్తుతం ఉన్న ధరకు రైతులు మిర్చిని అమ్మితే కూలీల ఖర్చులు కూడా రావని రైతులు వాపోతున్నారు. అందుకే నిల్వచేసుకునేందుకే రైతులు ఆసక్తి చూపుతూ మిర్చిని ట్రాక్టర్ల ద్వారా కోల్డ్‌స్టోరేజీలకు తరలిస్తుండగా, ఇదే అదనుగా కోల్డ్‌స్టోరేజీల నిర్వాహకులు రైతుల నుంచి అధికమొత్తంలో అద్దెలు వసూలు చేస్తూ సొమ్ముచేసుకుంటున్నారు.

కూటమి ప్రభుత్వం విఫలం..

మార్కెట్‌లో ధరలు తగ్గినప్పుడు తగిన చర్యలు తీసుకుని రైతులకు తగిన మద్దతు ధర లభించేలా చూస్తామన్న కూటమి ప్రభుత్వం ఆదిశగా తీసుకుంటున్న చర్యలు శూన్యమని రైతులు విమర్శిస్తున్నారు. మిర్చి క్వింటాకు మద్దతు ధర కేంద్ర ప్రభుత్వం రూ.11,781 ప్రకటించినప్పటికీ ఆధరకు కూడా వ్యాపారులు మిర్చిని అడగటంలేదని రైతులు వాపోతున్నారు. సాగుఖర్చుల కోసం, అప్పుల బాధలు భరించలేక కొందరు రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో వ్యాపారులు అడిగిన ధరకే మిర్చిని తెగనమ్ముకుంటున్న ఘటనలో గ్రామాల్లో చోటుచేసుకున్నాయి.

కోల్డ్‌స్టోరేజీల్లో సరుకు భద్రమేనా?..

ప్రస్తుత పరిస్థితుల్లో కోల్డ్‌స్టోరేజీల్లో నిల్వ ఉంచిన మిర్చి భద్రతపై కూడా రైతుల్లో అనుమానాలు నెలకొంటున్నాయి. ఇటీవల జగ్గయ్యపేట తొర్రగుంటపాలెం నుంచి తిరుమలగిరి వెళ్లే రోడ్డులోని సాయితిరుమల కోల్డ్‌స్టోరేజీల్లో అగ్ని ప్రమాదం సంభవించి 39 వేల మిర్చి టిక్కీలు అగ్నికి ఆహుతి కావడమే రైతుల ఆందోళనకు ప్రధాన కారణం. ఆరుగాలం కష్టించి పండించిన పంటను మద్దతు ధర వచ్చేవరకు వేచి ఉండేందుకు కోల్డ్‌స్టోరేజీకి తరలిస్తే, తీరా అగ్నిప్రమాదం రూపంలో తీవ్రనష్టాల పాలైన వందలాది మిర్చి రైతులను చూసి మిగిలిన రైతులు కోల్డ్‌స్టోరేజీల్లో సరుకు భద్రతపై ఆందోళన చెందుతున్నారు. గతంలో ఖమ్మం జిల్లా మధిరలో కూడా కోల్డ్‌స్టోరేజీ అగ్ని ప్రమాదంలో పెనుగంచిప్రోలు, వత్సవాయి, నందిగామ మండలాలకు చెందిన రైతుల వేల మిర్చి టిక్కీలు కాలిపోయిన ఘటనలను గుర్తుచేసుకుంటున్నారు. సాయి తిరుమల కోల్డ్‌స్టోరేజీ నిర్వాహకులు ఇన్స్యూరెన్స్‌ను రెన్యువల్ చేయని నేపథ్యంలో ఆయా కోల్డ్‌స్టోరేజీల్లో ఇన్స్యూరెన్స్ ఉందా? లేదా? అని రైతులు ఆరా తీస్తున్నారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం స్పందించి మిర్చికి మద్దతు ధర కల్పించి తమను ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఖర్చులు కూడా రావడం లేదు..



రెండు ఎకరాల్లో తేజా రకం మిర్చి పంట సాగు చేశాను. ఎరువులు, పురుగు మందులకు ఎకరానికి రూ.2.50 లక్షల వరకు పెట్టుబడి అయింది. ఎకరానికి 10క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. గతేడాది క్వింటా రూ.20 వేల నుంచి రూ.23వేల వరకు పలికింది. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటా రూ.8వేలకు అడుగుతుండటంతో కూలీల ఖర్చు కూడా వచ్చే పరిస్థితి లేదు. ఈ ఏడాది బాగా నష్టపోయాం.

– కాసరెల్లి నాగేశ్వరరావు, రైతు, కొళ్లికూళ్ల

పతనమవుతున్న ధరలు..



అతి తక్కువ ధరకు అమ్ముకోలేక భవిష్యత్‌లో పెరుగుతుందనే నమ్మకంతో కోల్డ్‌స్టోరేజీల్లో పంటను నిల్వ చేస్తున్నాం. నెల రోజుల వ్యవధిలో ధర క్వింటాకు రూ.2వేలు తగ్గింది. రోజు రోజుకు ధర పతనమవుతుండటంతో ఆందోళనగా ఉంది. గిట్టుబాటు ధర లభించక అప్పుల ఊబిలో చిక్కుకుపోతున్న పరిస్థితి. కోల్డ్‌స్టోరేజీల నిర్వహణపై ప్రభుత్వం తగిన పర్యవేక్షణ ఏర్పాటు చేయాలి.

– గుత్తా అరవింద్, రైతు, ముండ్లపాడు

చలివేంద్రం వద్ద అన్నదానం



జగ్గయ్యపేటఅర్బన్:పట్టణంలోని శ్రీవాసవీ సేవా సమితి జగ్గయ్యపేట వారి ఆధ్వర్యంలో ముక్త్యాల రోడ్‌లోని స్టీల్ షాపుల సెంటర్‌లో ఏర్పాటు చేసిన 100 రోజుల చలివేంద్రం వద్ద గురువారం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. అత్తులూరి వెంకటవిశ్వనాథ్, కావ్యల కుమారుడు వెంకట మోక్షిత్ పుట్టినరోజును పురస్కరించుకుని పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో శ్రీవాసవీ సేవాసమితి జిల్లా గౌరవాధ్యక్షుడు పేరూరి నరసింహారావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులు యన్నాకుల రాంబాబు, పెనుగొండ రామకృష్ణ, కంభంపాటి రవికుమార్, వాసవి క్లబ్ ప్రతినిధులు కె.వెంకటరమేష్, కర్లపాటి కొండ, రాయపూడి శ్రీకాంత్, వాసవీ సేవాసమితి కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



అనుమంచిపల్లి(జగ్గయ్యపేట): రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఏవో వరలక్ష్మి కోరారు. గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆమె ఏఓ మాట్లాడుతూ ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాకు రూ. 2,320, సాధారణ రకం రూ. 2,200 మద్దతు ధర కల్పిస్తోందని తెలిపారు. ముఖ్యంగా తేమశాతం 17 ఉండాలని చెప్పారు. గోనె సంచులు, హమాలీల ఖర్చులు ప్రభుత్వమే చెల్లిస్తుందని తెలిపారు. రెండు, మూడు రోజుల్లో వర్షం సూచన ఉండంతో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీకాంత్, పీఏసీఎస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

శిలువ మార్గం ర్యాలీ



బలుసుపాడు(జగ్గయ్యపేట అర్బన్): మండలంలోని బలుసుపాడు ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో గురువారం శిలువ మార్గం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ పెద్దలు, విశ్వాసులు కలసి యేసు పొందిన శ్రమలను వివరిస్తూ కీర్తనలు పాడుకుంటూ శిలువ మార్గం ర్యాలీ నిర్వహించారు. అనంతరం చర్చిలో ఉపదేశం అందజేశారు. ఫాదర్ గుడిసె జయరాజు, చర్చి ఉపదేశులు అలోషియస్, పి.మధు, పిలిఫ్, సంఘ పెద్దలు ఉప్పుతోళ్ల బాలస్వామి, మైల మేరి వినీత, గండమాల సురేష్, పోలంపల్లి దావీదు, సెయింట్‌ఆన్స్ సిస్టర్లు వసంత, వైశాలి, వివిధ గ్రామాల దీక్షాపరులు, సంఘస్తులు, మరియదళ సభ్యులు పాల్గొన్నారు.

7నుంచి విగ్రహ పునఃప్రతిష్టా మహోత్సవాలు

జగ్గయ్యపేటఅర్బన్: అద్దాలబజారులో వేంచేసియున్న శ్రీమహాలక్ష్మి అమ్మవారి వెండి దేవాలయంలో అమ్మవారి విగ్రహం పునః ప్రతిష్టా మహోత్సవాలను ఈనెల ఏడోతేదీ నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 9వ తేదీ ఉదయం 8.59నిమిషాలకు శ్రీమహాలక్ష్మి అమ్మవారి విగ్రహం పునః ప్రతిష్టా మహోత్సవం జరుగుతుందని వివరించారు. భక్తులు హాజరుకావాలని కోరారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం

కొటికలపూడి(ఇబ్రహీంపట్నం): శ్రీరామ నవమి సందర్భంగా కొటికలపూడి గ్రామంలో రాష్ట్ర స్థాయి ఇన్విటేషన్ వాలీబాల్ పోటీలు గురువారం రాత్రి ప్రారంభమయ్యాయి. కొటికలపూడి అంబేడ్కర్ యూత్, కృష్ణా జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీలను ఎంపీపీ పాలడుగు జోత్స్న, కూటమి నేతలు ప్రారంభించారు. ఫ్లడ్ లైట్ల వెలుగులో జరిగిన మొదటి మ్యాచ్‌లో కృష్ణా, విజయనగరం జిల్లా జట్లు తలపడ్డాయి.

7న జరిగే ధర్నాను విజయవంతం చేయాలి



పరిటాలలో కరపత్రాలను ప్రదర్శిస్తున్న సోమేశ్వరరావు తదితరులు

కంచికచర్ల: విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 7న విజయవాడలోని ఏపీసీపీడీసీఎల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు సీఐటియూ జిల్లా కమిటీ సభ్యులు ఎం.సోమేశ్వరరావు తెలిపారు. ఈ ధర్నాలో విద్యుత్ కాంట్రాక్టు కార్మికులంతా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ మండలంలోని పరిటాల, కంచికచర్ల విద్యుత్ సబ్ స్టేషన్ల వద్ద కాంట్రాక్టు కార్మికులకు గురువారం ఆయన ధర్నా కరపత్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా సోమేశ్వరరావు మాట్లాడుతూ ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కంలలో పనిచేస్తున్న విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, డైలీవేజ్, పీస్ రేట్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేస్తామని యువగళం పాదయాత్రలో లోకేష్ హామీ ఇచ్చారని, ఆ హామీని నిలబెట్టుకోవాలని కోరారు. విద్యుత్ సంస్థల్లోని కాంట్రాక్టు కార్మికులందరినీ బేషరతుగా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూఐ మండల కార్యదర్శి బెజ్జం భూషణం తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధం

ఎంపీపీ షేక్ మలక్‌బషీర్

కంచికచర్ల : వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని, పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని కంచికచర్ల ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ గురువారం తెలిపారు. దేశంలో మసీదు, ఆలయం పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెట్టడానికి బీజేపీ కుట్ర పన్నుతుండగా అందులో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం భాగస్వామ్యం కావడం బాధాకరమన్నారు.వక్ఫ్‌బిల్లు సవరణల కారణంగా వక్ఫ్‌భూములను ఆక్రమించుకున్న వారంతా రాత్రికి రాత్రి యజమానులుగా మారిపోతారన్నారు. ఈ బిల్లు ఆమోదం పొందిన తర్వాత దేశంలోని ప్రాచీన మందిరాలకు న్యాయం జరుగుతుంది తప్ప మసీదులకు కాదని పేర్కొన్నారు. వక్ఫ్ సవరణ బిల్లును పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. బిల్లు ఆమోదానికి సహకరించిన కూటమి నాయకులకు భవిష్యత్‌లో ముస్లిలంతా తగిన బుద్ధి చెబుతారని బషీర్ స్పష్టం చేశారు.

నేటి నుంచి షెడ్యూల్ ప్రకారం తాగునీటి సరఫరా

నందిగామటౌన్: నందిగామ పట్టణ ప్రజలు తాగునీటిని పొదుపుగా వాడుకోవాలని మున్సిపల్ కమిషనర్ రమణబాబు కోరారు. తన కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా అదనపునీటిని సరఫరా చేసేందుకు కీసర పంపింగ్ స్టేషన్ వద్ద రెండు బోర్లు వేసినట్లు తెలిపారు. ఈరెండు 30హెచ్‌పి బోర్లకు ఇంటర్ కనెక్షన్లు ఇవ్వడం, ఆర్‌అండ్‌బీ రిజర్వాయర్ దగ్గర ప్రధానవాటర్ సప్లయి లైన్‌ల వాల్వ్ రీప్లేస్‌మెంట్ మరమ్మతులు, లీకేజీ పనులను ఈనెల ఏడోతేదీ నుంచి తొమ్మిదో తేదీ వరకు చేపడుతున్నట్లు చెప్పారు. ఈక్రమంలో పట్టణ ప్రజలకు మంచినీటి అసౌకర్యం కలగకుండా పట్టణంలోని 20వార్డులకు షెడ్యూలు ప్రకారం నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. మరమ్మతులు పూర్తయ్యే వరకు ఈ నీటిని పొదుపుగా వాడుకోవాలని కోరారు. షెడ్యూల్‌లో భాగంగా ఈనెల 4వతేదీ శుక్రవారం పట్టణంలోని 2, 4, 11, 12, 17, 18,19, 20వ వార్డులకు తాగునీటిని సరఫరా చేస్తామన్నారు. 5వ తేదీన 5, 6, 14, 15, 16,17,18వ వార్డులకు, 6వతేదీన 1, 3, 9వ వార్డులకు, 7వ తేదీన 7, 8, 10వవార్డులకు తాగునీటిని సరఫరా చేస్తున్నామన్నారు. ఆయా తేదీల్లో ఆయా వార్డులకు సరఫరా అయ్యే తాగునీటిని పట్టణ ప్రజలు పొదుపుగా వాడుకోవాలని కమిషనర్ రమణబాబు కోరారు.

ఆకట్టుకున్న మాక్ డ్రిల్



అగ్నిప్రమాద బాధితుడిని కాపాడే విధానాన్ని మాక్‌డ్రిల్‌లో చూపుతున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం



విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ సభ్యులు

రావిరాల(జగ్గయ్యపేట): మండలంలోని రావిరాల గ్రామంలో ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ మంగళగిరి ఎస్‌డీఆర్‌ఎఫ్ ఆరో బెటాలియన్ ఆధ్వర్యంలో కృష్ణానది వద్ద గురువారం మాక్ డ్రిల్ నిర్వహించారు. గ్రామంలో అగ్నిప్రమాదాలు జరిగిన సమయంలో ఎలా స్పందించాలి.. ఇంటిలో గ్యాస్ సిలిండర్ పేలి మంటలు వ్యాపిస్తే తీసుకోవాల్సిన చర్యలు..నదిలో గల్లంతైనా, పడవ బోల్తా పడిన సమయంలో తీసుకోవాల్సిన రక్షణ చర్యలను ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు మాక్ డ్రిల్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రథమ చికిత్స చేసే విధానాన్ని వివరించారు. ఈసందర్భంగా ఇన్‌చార్జి తహసీల్దార్ మనోహర్ మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించినట్లు వివరించారు.

కార్యక్రమంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ కమాండర్ నగేష్‌బాబు, ఎంపీడీవో నితిన్, అగ్నిమాపక అధికారి శ్రీనివాస్, ఏడీఏలు భవానీ, పశువైద్య సంచాలకులు భవానీప్రసాద్, మేషం వెన్ని, ఇరిగేషన్ జేఈ రామనరసింహారావు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ స్వామినాయక్, వైద్యాధికారులు అనిల్‌కుమార్, కీర్తిరెడ్డి, మత్స్యశాఖ ఇన్‌స్పెక్టర్ శ్యాం లెనిన్‌బాబు అధికారులు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై ఎంపీటీసీల ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న వీరులపాడు ఎంపీపీ కోటేరు లక్ష్మి

వీరులపాడు: వేసవిలో తాగు, వాడుక నీటికి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని ఎంపీపీ కోటేరు లక్ష్మి కోరారు. మండలంలోని జుజ్జూరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఎంపీపీ లక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లో జరిగే అభివృద్ధి కార్యక్రమాల సమాచారాన్ని గ్రామాల్లోని ప్రజాప్రతినిధులకు తెలియజేయాలని అధికారులను కోరారు. అందుకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లోని తరగతుల రద్దు చేస్తే గ్రామాల్లోని విద్యార్థులు ఇబ్బందిపడతారన్నారు. అటువంటి చర్యలపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. జయంతి ఎంపీటీసీ సభ్యుడు ఇప్పల సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లోని సమస్యల పరిష్కారం కోరుతూ అధికారులకు లిఖిత పూర్వక అర్జీలు ఇచ్చినా పట్టించుకోవడం లేదని తెలిపారు. గ్రామంలో శిథిలావస్థకు చేరిన ఓవర్ హెడ్ ట్యాంకు ఎప్పుడు కూలుతుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ పట్టించుకోవడం లేదంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎంపీడీఓ అరుంధతీదేవి మాట్లాడుతూ సంబంధిత అధికారులతో మాట్లాడి శిథిలావస్థలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకు తొలగింపునకు తగిన చర్యలు చేపడతామని తెలిపారు. గ్రామాల్లో జరిగే అభివృద్ధి తదితర కార్యక్రమాల సమాచారాన్ని తప్పనిసరిగా సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు అందించాలని అధికారులకు సూచించారు. అనంతరం అజెండాలోని అంశాలను సభ్యులు ఆమోదించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ షేక్ నాగుల్ మీరా, ఎంపీటీసీ సభ్యులు శీలం రమణారెడ్డి, యాదాల సుజాత, బండి మహాలక్ష్మి,, వేమిరెడ్డి కోటేశ్వరి, ఎంఈవో పాల్ కెనడీ, డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు, ఏపీవో జనార్దన్, గ్రామ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రికి లైట్లు అందజేత

నందిగామటౌన్: ప్రభుత్వాస్పత్రిలోని సమస్యల పరిష్కారానికి తమ వంతు సహకారం అందించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వాస్పత్రికి గురువారం ఆమె వీధిలైట్లను అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆస్పత్రి ఆవరణలోని లైట్లు వెలగడం లేదని తమ దృష్టికి రావడంతో లైట్లు అందించినట్లు తెలిపారు. అనంతరం ఆస్పత్రిలోని గర్భిణీలు, రోగులతో మాట్లాడి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నందిగామలో మోస్తరు వర్షం

నందిగామ రూరల్: పట్టణంలో గురువారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు భానుడు విజృంభించినప్పటికీ సాయంత్రం సమయంలో ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై మోస్తరు వర్షం కురిసింది. నిన్నమొన్నటి వరకు ఉక్కపోత, వడగాలులు, ఎండ వేడిమితో అల్లాడిన ప్రజలు ఈ వర్షానికి సేద తీరారు.వరి కోతలు కోసి కల్లాల్లో ధాన్యాన్ని ఎండబెట్టిన రైతులు పంటను కాపాడుకునేందుకు నానాపాట్లు పడ్డారు. పట్టాలు కప్పి పంటను కాపాడుకునే యత్నం చేశారు. మిర్చి, మొక్కజొన్న రైతులు సైతం పంటను కాపాడుకునేందుకు అగచాట్లు పడ్డారు. రెండు, మూడు రోజులు వర్ష సూచన ఉన్నట్లు వాతావరణ శాఖాధికారులు చెబుతుండటంతో రైతులు వరి కోతలు వాయిదా వేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచించారు.

శాస్త్రోక్తంగా మహాయాగం

జుజ్జూరు(వీరులపాడు): మండలంలోని జుజ్జూరు గ్రామంలో వేంచేసియున్న యజ్ఞదత్తాత్రేయ స్వామి ఆలయంలో మహాయాగాన్ని గురువారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పీఠాధిపతులు మద్దూరి యజ్ఞనారాయణస్వామి ఆధ్వర్యంలో లోకక్షేమాన్ని కాంక్షిస్తూ విశ్వావసు నామ సంవత్సర చైత్రశుద్ధ పాడ్యమి సందర్భంగా వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ మహాయాగాన్ని వేదోక్తంగా జరిపించారు. ముందుగా స్వామి వారికి నూతన వస్త్రాలతో అలంకరించారు. ఈసందర్భంగా యజ్ఞనారాయణ శర్మ మాట్లాడుతూ మహాయాగం ఐదురోజుల పాటు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం ఆలయ ఆవరణలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వేద పండితులు కప్పగంతు రామలింగ ఘనాపాటి, మద్దూరి ఆంజనేయ స్వామి, లక్ష్మీనారాయణ ఘనాపాటి, నారాయణ శాస్త్రి, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ రమేష్‌పవారీ

నందిగామ రూరల్: స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు, మెడల్స్‌ను అందజేశారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ రమేష్ పవారీ మాట్లాడుతూ విద్యార్థులను ఒత్తిడి, భయాందోళనకు గురి చేయకుండా సృజనాత్మకతతో కూడిన విద్యనందిస్తున్నట్లు వివరించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఏజీఎం మురళీకృష్ణ, ఆర్ఎం వినోద్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.